క్లుప్తంగా

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



ఉపాధ్యాయులతో అకిరానందన్

మానకొండూర్: మహబూబాబాద్‌లో నవంబర్ 18 నుంచి 20వ తేదీ వరకు రాష్ట్రస్థాయి సెపక్‌తక్రా క్రీడాపోటీలు నిర్వహించారు. మండలంలోని చెంజర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి అకిరానందన్ పోటీల్లో పాల్గొని డిసెంబర్ 16 నుంచి 23 వరకు ఢిల్లీలో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడని కరీంనగర్ జిల్లా సెపక్‌తక్రా ప్రధాన కార్యదర్శి విజయభాస్కర్ రెడ్డి తెలిపారు. హెచ్ఎం లక్ష్మణ్‌రావు, టీచర్లు సమ్మిరెడ్డి, కుమార్ విద్యార్థిని అభినందించారు.

గురుకులంలో వైద్యశిబిరం



వైద్యశిబిరంలో పాల్గొన్న డాక్టర్లు

చొప్పదండి: పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల విద్యాలయంలో గురువారం హోమియోపతి వైద్య శిబిరం నిర్వహించారు. కేర్ హోమియోపతి కరీంనగర్ బ్రాంచ్ ఆధ్వర్యంలో వివిధ రకాల వ్యాధులపై అవగాహన కల్పించి మందులు పంపిణీ చేశారు. గురుకుల విద్యార్థులతోపాటు బోధన, బోధనేతర సిబ్బంది వైద్య సేవలను ఉపయోగించుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ స్వాతి, డాక్టర్ డేవిడ్ రాజ్, నుతేజ్, నాగరాజు, అమూల్య, తదితరులు పాల్గొన్నారు.

మానసాదేవి అమ్మవారిని దర్శించుకున్న ఎంపీడీవోలు



జ్ఞాపికలు అందిస్తున్న చంద్రారెడ్డి

గన్నేరువరం: మండలంలోని ఖాసీంపేట గ్రామం శ్రీమానసాదేవి ఆలయాన్ని గన్నేరువరం, హుజూరాబాద్, సైదాపూర్ మండలాల ఎంపీడీవోలు స్వాతి, జయశ్రీ, పద్మావతి గురువారం దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు మామిడాల నాగసాయిశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు. అలాగే ఆలయ కమిటీ చైర్మన్ ఏలేటి చంద్రారెడ్డి, ఉప సర్పంచ్ బద్దం సంపత్‌రెడ్డి వారికి జ్ఞాపికలు అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ డైరెక్టర్లు, భక్తులు పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత



జమ్మికుంట: పట్టణంలోని గాయత్రీ కోఆపరేటివ్ అర్బన్‌బ్యాంక్ ఖాతాదారుడు మద్దూరి రాజు ఇటీవల జరిగిన ప్రమాదంలో మృతిచెందాడు. మృతుడి తండ్రి కృష్ణమూర్తికి లక్ష రూపాయల ప్రమాదబీమా చెక్కును తహసీల్దార్ రజని చేతుల మీదుగా గురువారం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ బ్యాంక్ సేవలు అభినందనీయమన్నారు. ఈకార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ ఒద్దుల మహేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎలుగుబంటి కలకలం

గన్నేరువరం: మండలంలోని పారువెల్లలో ఎలుగుబంటి మళ్లీ ప్రత్యక్షం కావడంతో ప్రజలు, రైతులు భయాందోళన చెందుతున్నారు. గ్రామానికి చెందిన కొందరు బుధవారం వాహనంలో చెరువు వైపు వెళ్తుండగా.. మత్తడి వద్ద ఎలుగుబంటి ప్రత్యక్షమైంది. వాహన లైట్ల వెలుతురును గమనించి ఎలుగుబంటి చెట్లపొదల్లోకి పరుగుపెట్టింది. అక్టోబర్ 2వ తేదీన గన్నేరువరంలోకి ఎలుగుబంటి రావడంతో ఎస్సై చందా నరసింహారావు అప్రమత్తమై పోలీస్ వాహన సైరన్ వేయడంతో మానేరుడ్యాం శివారు ప్రాంతంలోకి వెళ్లిపోయింది. మళ్లీ ఎలుగు సంచారంతో రైతుల్లో అలజడి మొదలైంది. గతంలో జంగపల్లి, మైలారం, గన్నేరువరం గ్రామాల్లో రైతులపై ఎలుగుబంటి దాడి చేసిన సంఘటనలు జరగడంతో పొలాలకు వెళ్లే రైతులు ఆందోళన చెందుతున్నారు. ఫారెస్ట్ శాఖ అధికారులు స్పందించి ఎలుగుబంటిని బంధించాలని డిమాండ్ చేస్తున్నారు.

కాపర్ వైరు చోరీ

జమ్మికుంట: గుర్తు తెలియని దొంగలు ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాపర్‌వైరును చోరీ చేసిన ఘటన జమ్మికుంట మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మండలంలోని తనుగుల శివారులో ఈనెల 12తేదీ రాత్రి గుర్తు తెలియని దొంగలు ట్రాన్స్‌ఫార్మర్ పగులగొట్టి రూ.40వేల విలువైన కాపర్‌వైర్‌ను ఎత్తుకెళ్లారు. తనుగుల విద్యుత్‌శాఖ ఏఈ రవీందర్ ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ బార్పటి రమేశ్ తెలిపారు.

అద్దె భవనాలు.. అరకొర వసతులు

- గన్నేరువరం మండలం ఏర్పడి ఏడేళ్లు
- కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా తహసీల్దార్, ఇతర ఆఫీస్ భవనాల నిర్మాణం జరిగేనా ?
- మాటలతోనే కాలం వెళ్లదీసిన బీఆర్ఎస్ ప్రభుత్వం



అద్దెభవనంలో కొనసాగుతున్న తహసీల్దార్ కార్యాలయం

గన్నేరువరం: కొత్త మండలం.. కొంగొత్త పాలన... అందుబాటులో మండల కేంద్రం... పాలన ఇకా మరింత సౌలభ్యం... ఇది జిల్లా, మండలాల ఏర్పాటు సమయంలో బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు చెప్పిన వాఖ్యలను ప్రజలు నిజంగానే స్వాగతించారు. కానీ వాస్తవం మరోలా ఉంది. అద్దె భవనాలు.. అరకొరత వసతులు.. సిబ్బంది కొరత... అధిక శాఖల్లో ఇన్‌చార్జీలు.. గాడిన పడని పాలనతో ఏడు ఏళ్లు ముగిశాయి. కొత్త మండలం ఏర్పాటు చేశామని గొప్పగా చెప్పుకున్న మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ భవనాల నిర్మాణాల్లో నిర్లక్ష్యం చేశారనే విమర్శలున్నాయి. తహసీల్దార్, ఎంపీడీవో, ఎస్సై, ఏపీఎం మినహా ఏ అధికారి ఎక్కడ ఉంటారో తెలియని పరిస్థితి. ముఖ్యమైన వ్యవసాయశాఖ, ఆరోగ్యకేంద్రం, పశు వైద్యశాల పాలన ఆయోమయం. స్థలాలను గుర్తించి నాలుగేళ్లు గడుస్తున్న నిర్మాణాల ఊసేలేదు.

అద్దె భవనాలు..

గన్నేరువరం మండలాన్ని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం అధికారికంగా 2016 అక్టోబర్ 11న ఉత్తర్వులు జారీ చేసింది. 12న మండల కేంద్రంలో తహసీల్దార్, ఐకేపీ, వ్యవసాయశాఖ కార్యాలయాలను, పోలీస్‌స్టేషన్‌ను అద్దె భవనాల్లో ఏర్పాటు చేశారు. మొట్టమొదటి తహసీల్దార్‌గా సరిత నియామకమయ్యారు. అరకొర వసతులు, సిబ్బంది కొరతతో 9 నెలలకే బదిలీపై వెళ్లారు. ప్రస్తుతం తహసీల్దార్ కార్యాలయం అద్దె భవనంలో కొనసాగుతుండగా, మండల పరిషత్ కార్యాలయం నిర్వహణకు అద్దె భారంగా మారడంతో ఎస్సీ హాస్టల్‌లో గతేడాది తాత్కాలికంగా ఏర్పాటు చేశారు. మండల సర్వసభ్య సమావేశాలు టెంట్ కింద నిర్వహించుకోవాల్సి దుస్థితి నెలకొంది. మండల విభజన జరిగిన మండల పరిషత్‌కు సంబంధించిన పాలన 2016 నుంచి 2019 జూలై వరకు ఉమ్మడి బెజ్జంకి మండలం నుంచే కొనసాగింది. 2019లో మండల పరిషత్ ఎన్నికల అనంతరం అద్దె భవనంలో మండల పరిషత్ కార్యాయాలన్ని ఏర్పాటు చేశారు. అరకొర వసతులతో వ్యవసాయశాఖ కార్యాలయం ఇప్పటి వరకు మూడు అద్దె భవనాల్లో కొనసాగింది. రైతు వేదికల ద్వారా ఏఈవోలు వ్యవసాయశాఖ పాలన సాగుతోంది. ప్రస్తుతం సొంత భవనం లేక రైతువేదికలోనే కార్యాలయం ఏర్పాటు చేసుకున్నారు. వ్యవసాయశాఖ అధికారి ఎక్కడ ఉంటారో ఎవరికి అర్థం కానీ పరిస్థితి.

ఇన్‌చార్జీల పాలన

ఆరోగ్యకేంద్రం, పశువైద్యశాల దుస్థితి అధ్వానంగా ఉంది. ముఖ్యమైన కార్యాలయాలకు భవనాలు లేకపోవడంతో పాటు తిమ్మాపూర్ మండలం అధికారులకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. వీటితో పాటు విద్యా, పంచాయతీరాజ్ శాఖలది ఇదే పరిస్థితి. ప్రధాన ఆరోగ్య వైద్యకేంద్రం లేకపోవడంతో సామాన్య ప్రజలు అవస్థలు పడుతున్నారు. దీంతో ప్రజలు ప్రైవేట్ ఆసుపత్రులకు పరుగులుపెడుతుండగా ఇదే అదునుగా ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ అందినకాడికి దోచుకుంటున్నారనే ఆరోపణలు వినబడుతున్నాయి. అలాగే ఆయుర్వేద భవనంలో పోలీస్‌స్టేషన్ కొనసాగుతోంది. ఒకే ఒక్క భవనం ఉంది. దీంతో ఇక్కడ విధులు నిర్వహించే పోలీసులు, సిబ్బందికి ఇబ్బందులు తప్పడం లేదు. దీనికి సైతం స్థలం గుర్తించి నాలుగేళ్లు గడిచినా భవన నిర్మాణం ఊసేలేదు. ప్రతిశాఖ కార్యాలయంలోను సరియైన వసతులు లేక ఉద్యోగులు, సిబ్బంది విధులు నిర్వహించడానికి వెనకంజ వెస్తున్నారని గుసగుసలు. బదిలీపై వస్తున్న అధికారులు, సిబ్బంది ఏడాది కాక ముందే మళ్లీ బదిలీపై వెళ్లిపోతున్నారు. ప్రస్తుత తరుణంలో ప్రభుత్వం ఏర్పడటంతో మళ్లీ ఆశలు చిగురుస్తున్నాయి. ఈ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి సొంత భవన నిర్మాణాలను చేపట్టడంపై ప్రత్యేక చొరవ తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



ఎస్సీ హాస్టల్‌లో మండల పరిషత్ ఆఫీస్

స్థలాలను గుర్తించాం



మండల కేంద్రంలో సర్వే నంబర్ 327లో తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయానికి 30 గుంటలు, పోలీస్‌స్టేషన్‌కు 1.10 ఎకరం పదకొండు గుంటల స్థలాన్ని గుర్తించాం. దీనిపై ఉన్నత అధికారులకు నివేదికను నాలుగేళ్ల క్రితం అందజేశాం. ఈ ప్రభుత్వం హయాంలో సొంత భవనాల కల సాకారమవుతుందని ఆశిస్తున్నాం.

– భిక్షపతి, తహసీల్దార్ గన్నేరువరం

17న మండల సభ



స్థలాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ, నాయకులు

గన్నేరువరం: గన్నేరువరం మండల సర్వసభ్య సమావేశం 17న మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీపీ లింగాల మల్లారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఏర్పాట్లను కాంగ్రెస్ పార్టీ నాయకులతో పరిశీలించారు. మానకొండూర్ ఎమ్మెల్యేగా గెలుపొందిన కవ్వంపల్లి సత్యనారాయణ తొలిసారిగా మండల సభకు హాజరుకానున్నారు. మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఎంపీపీని బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ చేశారు. తదనంతరం 2020 నుంచి ఇటీవల జరిగిన ఎన్నికల వరకు మండల పరిషత్ సమావేశాలకు రసమయి హాజరుకాలేదు. ఎన్నికల సమయంలో ఎంపీపీ కాంగ్రెస్‌లో చేరారు. మండల పరిషత్‌కు సొంత భవనం లేకపోవడంతో ఎస్సీ సంక్షేమ హాస్టల్‌లో కొనసాగుతోంది. దీంతో సమావేశాలు ఆరుబయట టెంట్ వేసుకుని నిర్వహించుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ఎంపీపీ వెంట యువజన కాంగ్రెస్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అల్లూరి శ్రీనాథ్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి బొడ్డు సునీల్, మండల అధ్యక్షుడు ముస్కు ఉపేందర్‌రెడ్డి, సర్పంచ్ కరుణాకర్‌రెడ్డి, నాయకులు తిరుపతి, మల్లయ్య పాల్గొన్నారు.

ఆధార్‌కార్డు చూపి టికెట్ తీసుకోవాలి

హుజూరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 9 నుంచి మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించిన విషయం తెలిసిందే. 15వ తేదీ నుంచి మహిళలు తప్పనిసరిగా ఆధార్‌కార్డు చూపించి కండక్టర్ వద్ద జీరో టికెట్ తీసుకోవాలని హుజూరాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్ అర్పిత గురువారం తెలిపారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్



ఆయా పార్టీల ప్రతినిధులతో ప్రఫుల్ దేశాయి

చొప్పదండి: అర్హులు ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలని అదనపు కలెక్టర్, చొప్పదండి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రఫుల్ దేశాయ్ కోరారు. మండల కేంద్రంలోని రిటర్నింగ్ కార్యాలయంలో గురువారం ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. జనవరి 6న డ్రాఫ్ట్ ఓటరు లిస్టు పబ్లిష్ చేస్తామన్నారు. వివిధ ఫిర్యాదులు, అబ్జెక్షన్‌లపై చర్చించారు. పోలింగ్ బూత్ పరిధిలో 1,300 మంది కంటె ఎక్కువగా ఓటర్లు ఉంటే కొత్త పోలింగ్ బూత్ ఏర్పాటు చేయాలని కోరారు. రెండు కిలోమీటర్ల కంటే ఎక్కువ దూరంలో ఉన్న పోలింగ్ బూత్‌లను అధికారులు గుర్తించాలని సూచించారు. సమావేశంలో అధికారులతో పాటు ఎంపీపీ చిలుక రవీందర్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు లోక రాజేశ్వర్‌రెడ్డి, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి శ్రీధర్‌బాబును సన్మానించిన నాయకులు



శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

హుజూరాబాద్: రాష్ట్ర ఐటీశాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన దుద్దిల్ల శ్రీధర్‌బాబును హుజూరాబాద్‌కు చెందిన కాంగ్రెస్ నాయకులు దొంత రమేశ్, సందమల్ల బాబు, నరేశ్, బత్తిని రవీందర్‌గౌడ్, దుబాసి బాబు, ముక్కా రమేశ్, జంగ అనిల్‌కుమార్, వెంకన్న గురువారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థాన పట్టువస్త్రాలతో సన్మానించి ప్రసాదం అందజేశామన్నారు.

జమ్మికుంట: పట్టణానికి చెందిన మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తుమ్మేటి సమ్మిరెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు హైదరాబాద్‌లోని సచివాలయంలో ఉపముఖ్యమంత్రి, ఆర్థిక, విద్యుత్‌శాఖ మంత్రిభట్టి విక్రమార్క, ఇరిగేషన్, సివిల్‌సప్‌లైశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఐటీశాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్‌బాబు, వైద్య ఆరోగ్యశాఖ , ఫ్యామిలి వెల్ఫేర్ మంత్రి దామోదర్ రాజనర్సింహ, రెవెన్యూ, గృహ నిర్మాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా వారిని శాలువాలతో సన్మానించారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రమేశ్, ఎగ్గని శ్రీనివాస్, ఎండీ సలీం, ఇంగిలే రామరావు పాల్గొన్నారు.

సమాజంపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న సీడీపీవో సబిత

గన్నేరువరం: పిల్లల పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉంటూనే తగు జాగ్రత్తలు తీసుకోవాలని సీడీపీవో సబిత అన్నారు. మండలంలోని ఖాసీంపేట గ్రామ పంచాయతీ సర్పంచ్ గంప మల్లీశ్వరీ అధ్యక్షతన మిషన్ వాత్సల్య– బాలల పరిరక్షణ సేవ కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన బాలబాలికల హక్కుల రక్షణ, సంరక్షణ, సమాజంలో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు, న్యాయం, చట్టం అమలు తీరు తదితర అంశాలను వివరించారు. అనాథలకు విద్య, వైద్యం నిరాశ్రయులకు ఆశ్రమాలు, ఉపకార వేతనాలు తెలియజేశారు. బాలికలు చదువుతో పాటు సమాజంపై అవగాహన కల్గి ఉండాలన్నారు. అనంతరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేసి రికార్డులన పరిశీలించారు. కార్యక్రమంలో సహకార సంఘం డైరెక్టర్ వెంకన్న, ఉప సర్పంచ్ సంపత్‌రెడ్డి, మానసాదేవి ఆలయ కమిటీ చైర్మన్ చంద్రారెడ్డి, డీపీవో అరవింద, చైల్డ్ వేల్ఫేర్ అధికారి రమేశ్, ఏఎస్ఎం అనిత, కార్యదర్శి ఆనంద్, అంగన్‌వాడీ టీచర్లు శ్యామల, రాజేశ్వరీ, సీఏలు పద్మ, సంపత్‌కుమార్, వీవోలు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ముందస్తు క్రిస్మస్ వేడుకలు



దుస్తులు పంపిణీ చేస్తున్న మత పెద్దలు

హుజూరాబాద్‌రూరల్: ప్రపంచశాంతికి ఏసుక్రీస్తు బోధనలు ఎంతో ఉపయోగపడుతాయని మత పెద్దలు రెవ సీమోనుబాబు,ఎస్తేర్‌రాణి అన్నారు. మండలంలోని రంగాపూర్ గ్రామం కల్వరి టెంపుల్‌లో గురువారం పాస్టర్ రెవ డాక్టర్ నెల్సన్ ఆధ్వర్యంలో ముందస్తు క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై హైదరాబాద్‌కు చెందిన జీడి అగ్రప్పపద్మ అందజేసిన దుస్తులను నిరుపేదలకు పంపిణీ చేశారు. చర్చిలో క్రీస్మస్ కేక్ కట్ చేశారు. అనంతరం మాట్లాడుతూ..మనిషి మంచి ప్రవర్తనతో జీవించడానికి బైబిల్ తోడ్పడుతుందని పేర్కొన్నారు. క్రీస్తు ప్రజలందరిని మంచి మార్గంలో నడవలాని బోధించారని గుర్తుచేశారు. నియోజకవర్గానికి చెందిన పాస్టర్లు శాంసన్‌రత్న, సువార్త రాజులావణ్య, ఆనందంఎలీషమ్మ, సీహెచ్ రాజు, ఎస్ ప్రవీణ్ హాజరై ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

రైతులకు అవగాహన సదస్సు



పటం ద్వారాం రైతులకు అవగాహన కల్పిస్తున్న బీఎస్సీ అగ్రికల్చర్ విద్యార్థులు

జమ్మికుంట: మున్సిపల్ పరిధి మోత్కులగూడెంలో రైతులకు రూరల్ అగ్రికల్చర్ వర్క్, అనుభవంపై మల్లారెడ్డి యూనివర్సిటీ బీఎస్సీ అగ్రికల్చర్ విద్యార్థులు గురువారం అవగాహన కల్పించారు. రైతుల సమస్యలు, పరిష్కారం కోసం పీఆర్ఏ (పార్టిసిపేటరీ రూరల్ అప్రైజల్) కార్యక్రమం వివరించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సంపత్, కౌన్సిలర్లు రాము, రమేశ్, శ్రీలత, ఎఫ్‌పీవో చైర్మన్ సంద మహేందర్, కేవీకే సంబంధిత శాస్త్రవేత్తలు డాక్టర్ మహేశ్, ప్రశాంతి, వేణుగోపాల్ పాల్గొన్నారు.

సౌరశక్తిని సద్వినియోగం చేసుకోవాలి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సమితి బాధ్యులు

విద్యానగర్(కరీంనగర్): అపారంగా లభిస్తున్న సౌరశక్తిని సద్వినియోగం చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని మానేరు పర్యావరణ సమితి అధ్యక్షుడు తోట లక్ష్మణరావు అన్నారు. జాతీయ ఇంధన వనరుల పరిరక్షణ దినోత్సవం సందర్భంగా గురువారం కరీంనగర్ లయోల కళాశాలలో నిర్వహించిన కార్యక్రమానికి హాజరయ్యారు. సహజసిద్ధంగా లభించే ఇంధన వనరులను సద్వినియోగం చేసుకుంటూ భావితరాలకు భవిష్యత్తివ్వాలన్నారు. బొగ్గు, సహజ వాయువు, పెట్రోల్ తదితర ఇంధనాలు కాలక్రమంలో తరిగిపోతాయని అన్నారు. భవిష్యత్తులో ఇంధన వనరులు తరిగిపోవడంతో అనేక ఇబ్బందులు ఎదురుకాకుండా పుష్కలంగా లభిస్తున్న సౌరశక్తిపై దృష్టి సారించాలన్నారు. సౌరశక్తిపై రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించారు. మానేరు పర్యావరణ సమితి ప్రధాన కార్యదర్శి సామ నారాయణ, కళాశాల ప్రిన్సిపాల్ ఎంఎ అలెక్స్, వైస్ ప్రిన్సిపాల్ సాంబశివరావు, ఉపన్యాసకులు ఎ.అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఒకే కుటుంబ ఓట్లు ఒకే బూత్‌లో ఉండాలి

కరీంనగర్: పార్లమెంటు ఎన్నికల దృష్ట్యా జిల్లాలోని ఒకే కుటుంబంలోని ఓట్లు ఒకటే బూత్‌లోకి రావాలని కోరుతూ బీఆర్ఎస్ ఎన్నికల ఏజెంట్ సత్తినేని శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం కలెక్టర్ పమేలా సత్పతికి వినతిపత్రం సమర్పించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఒకే కుటుంబంలోని ఓట్లు ఒకే పోలింగ్ బూత్‌లోకి రావాలని, ఒకే బూత్‌లో పేర్లు రానందున దూర ప్రాంతం వెళ్లలేక ఓటు హక్కును వినియోగించుకోలేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. పోలింగ్ శాతం తగ్గే అవకాశముందన్నారు. గతంలో జరిగిన ఎలక్షన్ ఓటర్ లిస్టుకు, ఇప్పుడు వచ్చిన ఓటర్ లిస్ట్‌కు చాలా వ్యత్యాసాలున్నాయని, కొత్త ఓటరు అప్లై చేసినవారు స్థానికంగా ఉన్నారో లేదో తెలుసుకున్న తర్వాత ఓటర్ నమోదు చేయాలని అన్నారు. కలెక్టర్ స్పందిస్తూ.. ఒకే కుటుంబం ఓట్లు ఒకే పోలింగ్ సెంటర్‌లో వచ్చేలా జిల్లా యంత్రాంగం సహకరిస్తుందన్నారు. పార్లమెంటు ఎలక్షన్‌లో ఓటర్ శాతాన్ని పెంచి ఆరోగ్యవంతమైన ఓటరు ప్రక్రియ జరిగేలా సహకరిస్తామని తెలిపారు.

రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు ఎంపిక



కరీంనగర్‌రూరల్: బొమ్మకల్ బైపాస్‌లోని బిర్లా ఓపెన్‌మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు అవనీరెడ్డి, సుహర్ష్‌లు శుక్రవారం నుంచి జరగనున్న రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్‌పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల జిల్లాస్థాయిలో పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. విద్యార్థులను పాఠశాల చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ బబిత విశ్వనాథన్, స్పోర్ట్స్ ఇన్‌చార్జి శ్రీకాంత్, కోచ్ సురేందర్‌సింగ్, అనిల్ అభినందించారు.

ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడిగా రామకృష్ణ

విద్యానగర్(కరీంనగర్): అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ జాతీయ కార్యవర్గ సభ్యుడిగా రామకృష్ణ నియమితులయ్యారు. ఇటీవల ఢిల్లీ జరిగిన ఏబీవీపీ జాతీయ మహాసభల్లో వివిధ రాష్ట్రాలకు చెందిన ఏబీవీపీ నాయకులతో జాతీయ కమిటీని ఏర్పాటు చేయగా.. రామకృష్ణను కార్యవర్గ సభ్యుడిగా నియమించారు. ఏబీవీపీ రాష్ట్ర కమిటీలో కరీంనగర్ జిల్లా నుంచి విభాగ్ సంఘటన మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్నాడు. ఈసందర్భంగా రామకృష్ణ జాతీయ కార్యవర్గ సభ్యుడిగా ఎంపికవడంపై పలువురు ఏబీవీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం



కేక్ కట్ చేస్తున్న దివ్యాంగులు

మానకొండూర్: మండల కేంద్రంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకొని గురువారం కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో మమత, కవిత, శైలజ, రాజవ్వ, సీసీ వాణి, వజ్రమ్మ, శైలజ, రాజయ్య, మహేందర్, ఎల్లయ్య, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ త్వరగా కోలుకోవాలని పూజలు



హుజూరాబాద్: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ త్వరగా కోలుకొని ప్రజా క్షేత్రంలోకి రావాలని కోరుతూ గురువారం మున్సిపల్ పరిధిలోని ఐదోవార్డు కౌన్సిలర్ అపరాజ ముత్యంరాజు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు మేడారం సమ్మక్క–సారలమ్మ సన్నిధిలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నాయకులు భూమ్ రామకృష్ణ, స్వామి, రమేశ్, రోహిత్ ప్రసాద్ పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కరీంనగర్ జిల్లా :
9951602933, 9951602958, 9951602824
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
రమేష్, ACO - 7997958214
కరీంనగర్ : రాజశేఖర్ - 9618304759
చొప్పదండి : మొండయ్య - 7997958217
మానకొండూర్ : మహేశ్ - 9573106760
హుజూరాబాద్ : ప్రశాంత్ - 7331119941
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899